# తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం

## ముఖ్యమంత్రి గారి కార్యాలయం

---

ప్రెస్ రిలీజ్: 1 తేది: 17-7-14

---

హైదరాబాద్ నగరంలో సెప్టెంబర్ నెలాఖరు నాటికి 4జి వైఫై సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు అధికారులను ఆదేశించారు. నగరంలో డిజిటల్ బ్రాడ్ బాండ్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ ను మెరుగు పరచాలని సూచించారు.

సచివాలయంలో గురువారం ఐటి శాఖ మంత్రి కె. తారక రామారావు, హైదరాబాద్ కమిషనర్ సురేష్ కుమార్, సిఎంఓ ముఖ్య కార్యదర్శి నర్సింగ్ రావు, ప్రత్యేక కార్యదర్శి స్మితా సబర్వాల్ తదితరులతో కలిసి '4జి వైఫై నగరంగా హైదరాబాద్' అనే అంశంపై సమీక్ష జరిపారు. నగరంలో 4జి సేవలు విస్తరించడానికి ముందుకొచ్చిన రిలయన్స్ ప్రతినిధులు కూడా ఇందులో పాల్గొన్నారు. రిలయన్స్ స్టేట్ సిఇవో కెవిఎస్ వేణుగోపాల్, కో ఆర్డినేటర్ పివిఎల్ మాధవరావు, ఇతర ప్రతినిధులు హైదరాబాద్ నగరంతో పాటు, తెలంగాణలో 4జి వైఫై సేవల పనుల పురోగతిని వివరించారు. మొదటి విడతగా హైదరాబాద్ నగరంతో పాటు, తెలంగాణలోని 6 కార్పొరేషన్లు, 37 మున్సిపాలిటీలలో, రెండో విడతలో ఇతర నగరాలు, పట్టణాలు, 220 మండల కేంద్రాల్లో, మూడో విడతలో మొత్తం తెలంగాణలో 4జి సేవలు అందించడానికి ప్రణాళికలు వేసినట్లు చెప్పారు. హైదరాబాద్ నగరాన్ని మొత్తం 4జి వైఫై నగరంగా మార్చాలనే ప్రభుత్వ పట్టుదలకు తమ సంస్థ సహకారం ఉంటుందని రిలయన్స్ ప్రతినిధులు చెప్పారు. సెప్టెంబర్ నెలాఖరు వరకు ఐటి కంపెనీలు ఎక్కువగా ఉండే హైదరాబాద్ పశ్చిమ దిక్కున వైఫై సేవలు అందుబాటులోకి రావాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. డిసెంబర్ నెలఖరు వరకు హైదరాబాద్ మొత్తం 4జి వైఫై నగరంగా మారాలని ముఖ్యమంత్రి చెప్పారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచాలనే యోచన ప్రభుత్వానికుందని, 4జి వైఫై సేవలు కూడా హైదరాబాద్ ఖ్యాతిని మరింత

పెంచుతాయని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. అందుకే ఈ పనులను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పనిచేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని రిలయన్స్ ప్రతినిధులు చెప్పారు. తెలంగాణలో వైఫై సేవల కోసం ర.4100 కోట్లు ఖర్చు పెడుతున్నామని వెల్లడించారు. ఒక్క హైదరాబాద్ నగరంలోనే 1700 కిలీమీటర్ల ఓ.ఎఫ్.సి. లైను వేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే 500 కిలోమీటర్లు లైను పనులు పూర్తయ్యాయని చెప్పారు. మొదటి ఆరు నెలల పాటు ఉచితంగా వైఫై సేవలు అందిస్తామని చెప్పారు. హైదరాబాద్ తర్వాత వరంగల్ నగరాన్ని 4జి వైఫై నగరంగా మారుస్తామని కూడా వెల్లడించారు. 4జి వైఫై సేవలు వీలైనంత త్వరలో అందరికీ అందుబాటులోకి తేవాలన్నది తమ లక్ష్యమని ఇందుకోసం ముందుకు వచ్చిన రిలయన్స్ సంస్థకు అన్ని రకాలుగా సహకారం అందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. తాత్కాలికంగా టవర్లు నిర్మించుకుని పని ప్రారంభించాలని, తర్వాత అండర్ గ్రౌండ్ ఫైబర్ ఆప్టిక్ కేబుల్ నిర్మించుకోవాలని కూడా ముఖ్యమంత్రి చెప్పారు. రిలయన్స్ తో పాటు 4జి వైఫై సేవలు అందించడానికి ముందుకొచ్చే ఇతర సంస్థలకు కూడా ప్రభుత్వం నుంచి సహకారం ఉంటుందని ముఖ్యమంత్రి వెల్లడించారు. సెల్ ఫోన్, టివి, కంప్యూటర్, ఇంటర్ నెట్ వాడకం ఎక్కువయినందన ఇవన్నీ కూడా ఒక్క వైఫై కనెక్షన్ తో అందుబాటులోకి రావడం ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని, తక్కువ ధరలోనే అన్నీ అందుబాటులోకి వస్తాయని  ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. విద్య, వైద్యం, వ్యవసాయం తదితర రంగాల్లో కూడా సమాచార సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించాల్సి ఉందని, అందకు 4జి వైఫై సేవలు  ఎంతగానే దోహదపడతాయని ముఖ్యమంత్రి చెప్పారు. ఇంటర్ నెట్ వాడకంలో హైదరాబాద్ నగరం ప్రపంచంలోని ఇతర ముఖ్య నగరాల సరసన నిలిచిందన్నారు.